I

సాక్షి మహబూబ్‌నగర్

శనివారం ౹ 6 ౹ ఏప్రిల్ ౹ 2024

రంజాన్ వేళలు

ఇఫ్తార్ 6-38 (శనివారం సాయంత్రం)

సహర్ 4-46 (ఆదివారం తెల్లవారుజామున)



చదువు.. పరిశోధనలు

జడ్చర్ల డిగ్రీ కళాశాల విద్యార్థులు చదువుతూనే పరిశోధనలపై దృష్టిసారించారు.

వివరాలు IIలో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 43.3 /20.4

ఆకాశం నిర్మలంగా ఉంటూ అప్పుడప్పుడూ మేఘావృతమవుతుంది. మధ్యాహ్నం ఎండ ప్రభావం ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

రేపు ఆదర్శ పాఠశాలల ప్రవేశానికి పరీక్ష

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లాలోని ఆదర్శ పాఠశాలల్లో ప్రవేశానికి ఆదివారం ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు డీఈఓ రవీందర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 6 నుంచి 10వ తరగతి వరకు ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి ఆన్‌లైన్‌లో హాల్‌టికెట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. వాటిని డౌన్‌లోడ్ చేసుకుని పరీక్షలకు సకాలంలో హాజరు కావాలని సూచించారు.

ప్రశాంతంగా జేఈఈ మెయిన్స్ పరీక్షలు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ఎన్ఐటీ, ఐఐటీ వంటి ఇంజినీరింగ్ కళాశాలల్లో ప్రవేశాల కోసం ప్రభుత్వం నిర్వహిస్తున్న జేఈఈ మెయిన్స్ రెండో సెషన్ ప్రవేశ పరీక్షలు శుక్రవారం ప్రశాంతంగా జరిగాయి. ఉమ్మడి జిల్లాకు సంబంధించి మహబూబ్‌నగర్‌లోని ఫాతిమా విద్యాలయ, జేపీఎన్‌సీ కళాశాల రెండు కేంద్రాల్లో విద్యార్థులు పరీక్షలు రాశారు. ఈ మేరకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరిగిన పరీక్షకు 325 మంది విద్యార్థులకు గాను 296 మంది హాజరు కాగా.. మధ్యాహ్నం 3 నుంచి 6 గంటల వరకు జరిగిన పరీక్షకు 326 మందికి గాను 298 మంది విద్యార్థులు హాజరయ్యారు.

సాహిత్యంతో సమాజంలో విలువల పెంపు



స్టేషన్ మహబూబ్‌నగర్: సాహిత్యం సమాజంలో భాషా వికాసం, సాహిత్య విలువలు పెంపొందించడానికి దోహదం చేస్తుందని జాతీయ సాహిత్య పరిషత్ అధ్యక్షుడు ఆచార్య కసిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. స్థానిక స్కౌట్స్ గైడ్స్ భవనంలో శుక్రవారం తెలంగాణ మహిళా సాహిత్య, సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో శ్రీక్రోధి నామ సంవత్సరంగా సందర్భంగా ఉగాది కవి సమ్మేళనం, ఉగాది పురస్కారాల కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథి ఆచార్య కసిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ మహిళా సాహిత్య సంస్థ, సాహిత్య ఉపన్యాసాలు, కవి సమ్మేళనాలు, పురస్కారాల ప్రదానోత్సవం నిర్వహిస్తూ ఎందరికో స్ఫూర్తిగా నిలుస్తుందన్నారు. కాళోజీ అవార్డు గ్రహీత కోట్ల వెంకటేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో సాహిత్యానికి కొదవలేదన్నారు. అనంతరం సాహిత్య రంగంలో విశేష సేవలు అందిస్తున్న సందాపురం బుచ్చయ్య (ప్రముఖ పద్యకవి), డాక్టర్ గన్నోజు శ్రీనివాసాచారి (ప్రముఖ పద్యకవి), అల్వాల లక్ష్మణమూర్తి (ప్రముఖ పద్యకవి), సాయి మనస్విని (శాస్త్రీయ సంగీత గాయకురాలు) ఉగాది పురస్కారాలతో ఘనంగా సత్కరించారు. కవులు తమ కవితలను చక్కగా వినిపించారు. కార్యక్రమంలో విశ్రాంత డీఈఓ శివార్చక విజయ్‌కుమార్, తెలంగాణ మహిళా సాహిత్య, సాంస్కృతిక సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు రావూరి వనజ, జి.శాంతారెడ్డి, చుక్కాయపల్లి శ్రీదేవి, వల్లభాపురం జనార్దన, ఖాజామైనొద్దీన్, జగపతిరావు, లక్ష్మణ్‌గౌడ్, శ్రీదేవి, అనురాధ, సక్కుబాయి పాల్గొన్నారు.

మొక్కు తీర్చుకునేందుకు వెళ్తూ..

- బొలెరో బోల్తాపడి ఇద్దరి దుర్మరణం
- మరో ఐదుగురికి గాయాలు

- వివరాలు IIలో



మినీ ట్యాంక్‌బండ్‌పై పూర్తయినా సందర్శకులకు అందుబాటులోకి రాని సస్పెన్షన్ బ్రిడ్జి



ఆర్చ్‌గా మార్చకుండా అలాగే వదిలేసిన ఇనుప సామగ్రి

ఎక్కడి పనులు అక్కడే!

- పెద్దచెరువు సుందరీకరణ పూర్తయ్యేనా?
- నిధుల లేమితో ఆగిపోయిన వైనం
- మినీ ట్యాంక్‌బండ్ వద్ద ఆహ్లాదం కరువు
- కాంట్రాక్టర్లకు ఇంకా చెల్లించని బిల్లులు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: నిధుల లేమితో పెద్దచెరువు వద్ద సుందరీకరణ పనులు ఎక్కడికక్కడే ఆగిపోయాయి. ఒక్క సస్పెన్షన్ బ్రిడ్జి తప్పా మిగతావి పూర్తికాకపోవడంతో పట్టణ ప్రజలకు ఆహ్లాదం కరువైంది. వాస్తవానికి జిల్లాకేంద్రంలోని నడిబొడ్డున ఉన్న ఈ చెరువును మినీట్యాంక్ బండ్‌గా మార్చడమే గాక నెక్లెస్‌రోడ్డు, వాకింగ్ ట్రాక్, ఐలాండ్, సస్పెన్షన్ బ్రిడ్జి, బోటింగ్ సౌకర్యం కల్పించాలని గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2022లో నిర్ణయించింది. దీనిపై అప్పటి పర్యాటక శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ గడువులోగా పనులు చేయించాలని ఆదేశించినా ప్రయోజనం దక్కలేదు. చేపట్టిన పనులకు సంబంధించి కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించకపోవడంతో నిలిచిపోయాయి. సుమారు 130 ఎకరాలలో పెద్దచెరువు విస్తరించి ఉంది. సుందరీకరణలో భాగంగా ఇక్కడ నెక్లెస్ రోడ్డు, పెద్దచెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్, వివిధ ఆకృతులు కలిగిన ఆర్చ్‌ల నిర్మాణానికి పర్యాటక శాఖ నుంచి రూ.49 కోట్లు కేటాయించారు. ఇందులో ఇప్పటివరకు 30 శాతం పనులే చేపట్టారు. దీనికి గాను మొదటి విడతలో రూ.4.5కోట్లు, రెండో విడత రూ.2.5 కోట్లు ఇలా మొత్తం రూ.ఏడు కోట్లకు బిల్లులను సదరు కాంట్రాక్టర్ వైఏటీ అండ్ సీ విభాగానికి పంపించారు. అయితే నిధులు విడుదల కాకపోవడంతో ఈ డబ్బులు చెల్లించలేదు. ఇక నీటిపారుదల శాఖ ఆధ్వర్యంలో చుట్టూ కట్టతో పాటు ఐలాండ్ కోసం రూ.18.89 కోట్లు కేటాయించారు. ఈ పనులు 95 శాతం పూర్తయ్యాయి. కేవలం రామాలయం సమీపంలో బ్రిడ్జి, స్లాబ్ పనులు మాత్రమే మిగిలిపోయాయి. అయితే కాంట్రాక్టర్‌కు ఇంకా రూ.పది కోట్లు చెల్లించాల్సి ఉంది. ఈ నిధులు విడుదలైతే 15 రోజులలో మొత్తం పని పూర్తవుతుందని ఇంజినీరింగ్ అధికారులు చెబుతున్నారు.



మినీ ట్యాంక్‌బండ్‌పై పూర్తికాని వివిధ డిజైన్ల ఆకృతులు

సస్పెన్షన్ బ్రిడ్జి మాత్రమే పూర్తి

సుందరీకరణలో భాగంగా పర్యాటక శాఖ ఆధ్వర్యంలో సస్పెన్షన్ బ్రిడ్జి నిర్మాణానికి రూ.14 కోట్లు కేటాయించారు. 2022 మే లో పనులు చేపట్టి 15 నెలల్లో పూర్తి కాగా గత ఏడాది అక్టోబర్ 2న ప్రారంభోత్సవం చేశారు. ప్రస్తుతం దీనిని సందర్శించే అవకాశమే లేదు. కారణం అక్కడి గేట్‌కు తాళం వేసేశారు. ఇక పెద్దచెరువుకు సమీపంలోనే రామయ్యబౌలి వద్ద 2021 నవంబర్‌లో రూ.16.50 కోట్లతో శిల్పారామం పనులు చేపట్టారు. గత ఏడాది మే 6న దీనికి ప్రారంభోత్సవం చేసినా చుట్టూ ప్రహరీని సగం వరకు అసంపూర్తిగానే వదిలేశారు. మరో రూ.1.50 కోట్లు కేటాయిస్తేనే పూర్తవుతుంది. మొత్తం 6.89 ఎకరాలలో విస్తరించిన ఈ శిల్పారామంలో అప్పుడప్పుడు కొన్ని కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇదిలా ఉండగా గత డిసెంబర్‌లో నిర్వహించిన శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ప్రభుత్వం మారడంతో ఈ పనులన్నింటిపై తీవ్ర ప్రభావం పడింది. ముఖ్యంగా పెద్దచెరువు వద్ద సుందరీకరణ పనులు పూర్తవుతాయో? లేదో? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.



అసంపూర్తిగా స్వాగత తోరణం

మురుగు చెంత సుందరీకరణా?



ముందుచూపు లేకుండా పట్టణం నడిబొడ్డున మురుగు చెంత పెద్దచెరువులో సుందరీకరణ చేపట్టడం సరికాదు. ముందుగా అక్కడి మురుగునీటి సమస్యను పరిష్కరించకుండా గత బీఆర్ఎస్ ప్రభుత్వం షోకుల కోసం రూ.కోట్లలో వెచ్చించాలని తీసుకున్న నిర్ణయం తగదు. ఆయా శాఖల్లో నిధులు లేకున్నా ఇలాంటి పనులను చేపట్టడం వల్ల ఎలాంటి ఉపయోగం లేదు. ఎంపీ ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత ఈ విషయాన్ని రాష్ట్ర నీటిపారుదల, పర్యాటక, మున్సిపల్ శాఖ మంత్రుల దృష్టికి తీసుకెళ్లి క్షుణ్ణంగా సమీక్షిస్తాం. దీనిపై ముందుకు వెళ్లాలా? లేదా? అనేది ఆ తర్వాతే స్పష్టమవుతుంది.

– యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే, మహబూబ్‌నగర్

మళ్లీ మైనింగ్..!

బల్మూరు మండలం మైలారం గుట్టపై తవ్వకాలు

- కాంట్రాక్టర్‌కు నియోజకవర్గ 'ముఖ్య' నేత అండదండలు
- పోలీసుల సాయంతో గ్రామస్తుల నోరు మూయించే ప్రయత్నం
- చెంతనే ఉన్న ఇళ్లకు ముప్పు ఉందని స్థానికుల ఆందోళన
- అనుమతులు రద్దు చేయాలని డిమాండ్. సీఐ హామీతో శాంతించిన గ్రామస్తులు



మైనింగ్ చేపట్టే గుట్ట వద్ద గ్రామస్తుల నిరసన

సాక్షి, నాగర్‌కర్నూల్/ బల్మూర్: ఆ గ్రామానికి ఆనుకొని ఉన్న గుట్టపై సాగుతున్న మైనింగ్ తవ్వకాలపై ప్రజలు ఆందోళన చెందుతున్నారు. బ్లాస్టింగ్, భారీ యంత్రాలు, వాహనాలతో మైనింగ్ కోసం నిర్వహించే తవ్వకాలతో గ్రామంలోని ఇళ్లకు ముప్పు వాటిల్లడంతో పాటు తమ ఊరే ఉనికిలో లేకుండా పోతుందని ఆందోళన చెందుతున్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా బల్మూర్ మండలం మైలారం గ్రామంలోని గుట్టపై రెండు రోజులుగా మొదలైన మైనింగ్ తవ్వకాలను శుక్రవారం గ్రామస్తులు అడ్డుకున్నారు. గ్రామస్తుల అభీష్టానికి వ్యతిరేకంగా.. పంచాయతీ తీర్మానం పేరుతో పాలకవర్గం సంతకాలను ఫోర్జరీ చేసి మరీ తెచ్చుకున్న మైనింగ్ అనుమతులను ఉన్నతాధికారులు రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ క్రమంలో మైనింగ్ నిర్వాహకులు, గ్రామస్తులకు మధ్య వాగ్వాదం నెలకొని ఉద్రిక్త పరిస్థితులు చోటుచేసుకోవడంతో సీఐ రవీందర్, ఎస్ఐ బాలరాజు ఘటనా స్థలానికి చేరుకుని గ్రామస్తులకు నచ్చజెప్పారు. తవ్వకాలను తాత్కాలికంగా నిలిపివేయాలని, ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చేదాకా వేచి చూడాలని హామీ ఇవ్వడంతో వివాదం సద్దుమణిగింది. అయితే గ్రామానికి ముప్పు వాటిల్లేలా ఉన్న మైనింగ్ అనుమతులను రద్దు చేయాలని, అధికారులు స్పందించకుంటే న్యాయ పోరాటానికి దిగుతామని గ్రామస్తులు స్పష్టం చేస్తున్నారు.



మైలారం గుట్ట వద్ద ఆందోళన చేస్తున్న గ్రామస్తులతో మాట్లాడుతున్న సీఐ రవీందర్

అనుమతులు ఉన్నాయి కదా..

మైలారంలో సుమారు 530 వరకు కుటుంబాలు, 1,850 వరకు జనాభా నివసిస్తున్నారు. వీరిలో కొన్ని కుటుంబాలు ఏళ్లుగా గ్రామానికి ఆనుకొని ఉన్న గుట్టపై ఇళ్లు నిర్మించుకుని జీవిస్తున్నారు. మైలారం గుట్టపై పురాతన శివాలయం, ఏటా సంక్రాంతి సందర్భంగా ఉత్సవాలు నిర్వహించే నరసింహాస్వామి ఆలయాలు ఉన్నాయి. మైలారం గ్రామానికి వాయువ్య దిశలో ఉన్న మైలారం గుట్టపై స్ఫటికం (క్వార్ట్జ్), ఫెల్డ్‌స్పర్ ఖనిజ తవ్వకాలకు మైనింగ్ శాఖ 2017లో అనుమతించింది. గుట్టపై ఉన్న సర్వే నంబరు 120/1లో 24.28 హెక్టార్ల మేర తవ్వకాలు జరిపేందుకు అవకాశం కల్పించింది. అయితే మైనింగ్ జరిగే ప్రాంతానికి 150 మీటర్ల దూరంలోనే ఇళ్లు ఉండటంతో స్థానికుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. దీనిపై మూడేళ్ల కిందటే గ్రామస్తులు ఏకమై మైనింగ్ తవ్వకాలను అడ్డుకున్నారు. అప్పట్లో గ్రామస్తుల నిరసనలతో నిలిచిపోయిన మైనింగ్ ఇటీవల చోటుచేసుకున్న రాజకీయ పరిణామాల నేపథ్యంలోనే మళ్లీ మొదలైందని, ఇందుకు నియోజవర్గంలోని ముఖ్యనేత సహకరిస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. అనుమతులు పొందిన కాంట్రాక్టర్‌కు సదరు ముఖ్యనేత మద్దతు పలుకుతున్న నేపథ్యంలో పోలీసులు సైతం వారికే వత్తాసు పలుకుతున్నారని వాపోతున్నారు. మైనింగ్‌కు అనుమతులు ఉన్నాయి కదా.. అంటూ గ్రామస్తులకే నచ్చజెప్పే ప్రయత్నం చేయడం కలవరపెడుతోంది.

ఫోర్జరీ సంతకాలతో గ్రామసభ తీర్మానం..

గ్రామ పంచాయతీ పరిధిలో మైనింగ్ వెలికితీత, అనుమతుల మంజూరులో గ్రామ సభ తీర్మానం కీలకం కాగా.. ఈ తీర్మానం చేసిన విషయం గ్రామస్తులకే తెలియకపోవడం గమనార్హం. ప్రజల ఆందోళన సందర్భంగా ఆర్టీఐ ద్వారా గ్రామసభ తీర్మానం కాపీ వెలుగులోకి వచ్చింది. ఇందులో గ్రామస్తులకు తెలియకుండానే పాలకవర్గంతోపాటు పలువురు గ్రామస్తుల పేరుతో సంతకాలను ఫోర్జరీ చేశారని గుర్తించారు. దీనిపైనే సంబంధిత అధికారులను కలిసి నిలదీశారు. గ్రామస్తుల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకోకుండా పొందిన అనుమతులను రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

పోలీసులను అడ్డుపెట్టి..



మైలారం గ్రామానికి ఆనుకునే ఉన్న గుట్టపై బ్లాస్టింగ్ ద్వారా మైనింగ్ తవ్వకాలు చేస్తే మా ఇళ్లకు నెర్రెలు వచ్చి కూలిపోతాయి. గ్రామంలోని చాలామంది ఇళ్లు గుట్టపైనే ఉన్నాయి. గ్రామస్తులకు తెలియకుండా ఫోర్జరీ సంతకాలతో తీర్మానించి అనుమతులు పొందడం అన్యాయం. పోలీసులను అడ్డం పెట్టుకొని తవ్వకాలు జరుపుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి వెంటనే మైనింగ్ అనుమతులు రద్దు చేయాలి.

– నిరంజన్, మైలారం

ఊరే లేకుండా పోతది..



మా ఊరికి ఆధారంగా ఉన్న గుట్టపై మైనింగ్ కోసం బ్లాస్టింగ్ చేస్తే ఊరంతా నష్టపోతుంది. గుట్టపై ఇళ్లు, నరసింహాస్వామి ఆలయం, శివాలయం ఉన్నాయి. మైనింగ్ తవ్వకాలను నిలిపివేయాలి. మైనింగ్ కోసం తవ్వకాలను ఆపకుంటే గ్రామస్తులమంతా కలిసి న్యాయ పోరాటం చేస్తాం.

– గద్దం లక్ష్మమ్మ, మహిళా రైతు, మైలారం

చదువుతోనే సమాజంలో గుర్తింపు

మహబూబ్‌నగర్ రూరల్/ మహబూబ్‌నగర్ న్యూటౌన్: చదువుతోనే సమాజంలో గౌరవం, గుర్తింపు లభిస్తాయని, ఆ దిశగా అందరూ కృషిచేయాలని కలెక్టర్ రవినాయక్ అన్నారు. శుక్రవారం బాబు జగ్జీవన్‌రాం జయంతిని పురస్కరించుకొని తెలంగాణ చౌరస్తాలోని ఆయన విగ్రహం వద్ద ఎస్సీ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో అధికారికంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా జగ్జీవన్‌రాం విగ్రహానికి కలెక్టర్ రవినాయక్, అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ సంఘ సంస్కర్తగా, బడుగు బలహీన వర్గాల కోసం బాబు జగ్జీవన్‌రాం ఎంతో కృషిచేశారన్నారు. స్వాతంత్ర్య ఉద్యమంలో తనవంతు పాత్ర పోషించారన్నారు. సామాజిక సమానత్వం, అణగారిన వర్గాల హక్కుల కోసం అలుపెరగని పోరాటం కొనసాగించారని కొనియాడారు. సమాజంలో అసమానతలు తొలగించేందుకు ఎందరో మహనీయులు తమ ప్రాణాలు పణంగా పెట్టి అహర్నిషలు కృషిచేశారని అభిప్రాయపడ్డారు. సమాజంలో మార్పు కోసం ప్రతిఒక్కరూ పాటుపడాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి ఫలాలను అందిపుచ్చుకొని ఆర్థికంగా ఎదగాలని ఆకాంక్షించారు.

కలెక్టరేట్‌లో...

కలెక్టరేట్‌లో బాబు జగ్జీవన్‌రాం జయంతిని ఘనంగా నిర్వహించారు. సమావేశ మందిరంలో బాబు జగ్జీవన్‌రాం చిత్రపటాన్ని ఏర్పాటుచేసి అదనపు కలెక్టర్ మోహన్‌రావు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఓ నర్సింహులు, కలెక్టరేట్ ఏఓ శంకర్, సిబ్బంది పాల్గొన్నారు.



తెలంగాణ చౌరస్తాలో బాబు జగ్జీవన్‌రాం విగ్రహానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ రవినాయక్

భక్తిశ్రద్ధలతో జుమాతుల్‌విదా



స్టేషన్ మహబూబ్‌నగర్: రంజాన్ మాసం జుమాతుల్‌విదా (చివరి శుక్రవారం) నమాజును ముస్లింలు భక్తిశ్రద్ధలతో చేశారు. జిల్లాకేంద్రంతోపాటు పట్టణాలు, మండలాలు, గ్రామాల్లోని మసీదుల్లో ముస్లింలు జుమ్మతుల్‌విదా ప్రత్యేక నమాజు చేశారు. శుక్రవారం నమాజుతో మసీదులన్నీ ముస్లింలతో కిటకిటలాడాయి. వారితో ఇమామ్‌లు నమాజు చేయించడంతోపాటు దువా చేశారు. ప్రజలందరూ సుఖశాంతులతో గడపాలని దైవాన్ని ప్రార్థించారు. జిల్లాకేంద్రంలోని జామియా మసీదు, మదీనా, మక్కా, గోల్, మోతీ, మునీరీ, రహెమానియా, అలీమ్, మస్జీదే అల్ కౌసర్, షాసాబ్‌గుట్ట, రైల్వేస్టేషన్ ఓమర్ ఓ అమేనా మసీదులతో పాటు వీరన్నపేట, పద్మావతీకాలనీ, రామయ్యబౌళి, పాన్ చౌరస్తా, బోయపల్లి గేట్, టీడీగుట్ట, వక్ఫ్ కాంప్లెక్స్ మైదానం తదితర ప్రాంతాల్లోని మసీదుల్లో జరిగిన సామూహిక శుక్రవారం ప్రార్థనల్లో ముస్లింలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మైనింగ్ ఆపకపోతే ఉద్యమిస్తాం



బీఆర్ఎస్ నాయకులను అడ్డుకుంటున్న పోలీసులు

అచ్చంపేట రూరల్: నల్లమల ప్రాంతంలో అక్రమంగా మైనింగ్ పనులు చేస్తే ఊరుకునేది లేదని, పనులు ఆపకపోతే ఉద్యమిస్తామని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు, బీఆర్ఎస్ నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ హెచ్చరించారు. నాగర్‌కర్నూల్ జిల్లా బల్మూర్ మండలం మైలారం వద్ద అక్రమంగా మైనింగ్ పనులు చేస్తున్నారని ఆరోపిస్తూ అక్కడికి వెళ్లడానికి ప్రయత్నించిన బీఆర్ఎస్ నాయకులను శుక్రవారం అచ్చంపేట సమీపంలో పోలీసులు అడ్డుకున్నారు. అక్కడ ఎలాంటి పనులు జరగడం లేదని, వాహనాలను పంపించామని పోలీసులు చెప్పడంతో వెనుదిరిగారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే బాలరాజు మాట్లాడుతూ గతంలో తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు గ్రామసభలో తీర్మానం చేశారని, దానికి మద్దతిస్తూ ఎట్టి పరిస్థితుల్లో మైనింగ్ జరగవద్దని అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. సీఎం రేవంత్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే వంశీకృష్ణ అండతోనే పనులు కొనసాగించడానికి కొందరు వచ్చారన్నారు. పార్లమెంట్ ఎన్నికల కోడ్, 144 సెక్షన్ అమలులో ఉన్నా నిబంధనలకు విరుద్ధంగా మైనింగ్ చేయడానికి ఎలా వస్తారని ప్రశ్నించారు. ప్రజాభిప్రాయం లేకుండా, ప్రజలకు వ్యతిరేకంగా పనులు జరుగుతాయంటే తాము ఊరుకునే ప్రసక్తే లేదన్నారు. గతంలో కేంద్రం నుంచి యురేనియం తవ్వకానికి అనుమతి ఉందని వస్తే అసెంబ్లీలో తాను చర్చ జరిపి అప్పటి సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్తే అసెంబ్లీ సాక్షిగా మైనింగ్, యురేనియానికి వ్యతిరేకంగా కేంద్రానికి తీర్మానం పంపామని గుర్తుచేశారు.

హామీలపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు



మాట్లాడుతున్న డీకే అరుణ

పాలమూరు: రాష్ట్రవ్యాప్తంగా ఇబ్బందుల్లో ఉన్న రైతులను ఆదుకోవడంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి లేదని, రైతులకు ఇచ్చిన హామీలు నెరవేర్చే వరకు కాంగ్రెస్‌ను వదిలిపెట్టకుండా ప్రశ్నిస్తూ..నిలదీస్తామని మహబూబ్‌నగర్ బీజేపీ ఎంపీ అభ్యర్థి డీకే అరుణ అన్నారు. జిల్లా బీజేపీ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కేంద్రంలోని టీటీడీ కల్యాణ మండపం ఎదుట ఏర్పాటు చేసిన రైతు సత్యాగ్రహ దీక్ష కార్యక్రమానికి ఆమె హాజరై మాట్లాడారు. రైతులకు ఇచ్చిన హామీలపై సీఎం రేవంత్‌రెడ్డి సమాధానం చెప్పాలన్నారు. 17 ఎంపీ సీట్లు గెలిపిస్తేనే హామీలు నెరవేరుస్తాం అంటూ సీఎం చెప్పినప్పుడే అర్థమైందని.. రాష్ట్ర ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చారన్నారు. ఈ ప్రభుత్వం రైతులకు ఇస్తానని చెప్పిన రూ.2 లక్షల రుణమాఫీ, రూ.25 వేల నష్టపరిహారం, రైతుబంధు, కౌలు రైతులకు రూ.15 వేలు, రూ.12 వేల భృతి, రైతులకు ఇస్తానని చెప్పిన రూ.50 0బోనస్.. తదితర హామీలు ఏమయ్యాయన్నారు.ఎన్నికల పేరుతో నమ్మించి మోసం చేసిన కాంగ్రెస్ పార్టీకి రైతులు గట్టిగా సమాధానం చెప్పాలన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో ఎలా గెలువాలనే ధ్యాస తప్పితే..రైతులకు మేలు చేద్దాం అనే ఆలోచన కాంగ్రెస్ పార్టీ పాలకులకు లేదన్నారు. ప్రాజెక్టులలో నీళ్లు లేవని, పంటలు పూర్తిగా ఎండిపోతున్నాయని.. ఇవేవీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ఇచ్చిన హామీలు అమలు చేయలేక కాంగ్రెస్ పార్టీ తన బాధ్యతల నుంచి తప్పించుకునేందుకు చూస్తోందన్నారు. గత రాష్ట్ర ప్రభుత్వ అవినీతిని ఎండగడుతూ బీజేపీ పోరాటం చేస్తే.. కళ్లబొల్లి మాటలు చెబుతూ ఆరు గ్యారంటీలతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందన్నారు. సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు పద్మజారెడ్డి, ఎగ్గని నర్సింహులు, రవీందర్‌రెడ్డి, బాలత్రిపుర సుందరి, రాజు, డోకూర్ పవన్‌కుమార్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, కృష్ణవర్ధన్‌రెడ్డి, అంజయ్య పాల్గొన్నారు.

ప్రజాపాలనలో భరోసా కల్పిస్తాం



సమావేశంలో మాట్లాడుతున్న వంశీచంద్‌రెడ్డి

స్టేషన్ మహబూబ్‌నగర్: గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు వైద్యపరమైన ఇబ్బందులు పడకుండా ప్రథమ చికిత్స అందిస్తున్న గ్రామీణ వైద్య సేవకులకు ప్రజాపాలనలో అండగా ఉంటూ భరోసా కల్పిస్తామని కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి అన్నారు. జిల్లాకేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో శుక్రవారం తెలంగాణ జిల్లా గ్రామీణ వైద్య సేవకుల సంఘం ఏర్పాటు చేసిన విజ్ఞాన సదస్సులో ఆయనతోపాటు ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వంశీచంద్‌రెడ్డి మాట్లాడుతూ గతంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి దూరదృష్టితో గ్రామీణ ప్రాంతాల్లో వైద్య రంగానికి ప్రాధాన్యత ఇచ్చి ఆర్ఎంపీలకు ప్రత్యేక శిక్షణ కల్పించి గ్రామీణ స్థాయిలో ఒక గుర్తింపు తెచ్చారని గుర్తుచేశారు. గ్రామీణ సేవకులను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాల్లో భాగస్వాములు చేసే దిశగా సీఎం దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవకుల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తామన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో గ్రామీణ వైద్యులు ఊపిరి పోశారని, కానీ, మొదట అధికారంలోకి వచ్చిన కేసీఆర్ పదేళ్లపాటు చేసిన మోసానికి బలి అయ్యారని విమర్శించారు. గ్రామీణ ప్రాంతాల్లో మీకున్న సంబంధాలు గొప్పవని, మన బతుకులు మారాలంటే కాంగ్రెస్ పార్టీకి అండగా నిలబడాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్, రాష్ట్ర ఓబీసీ సెల్ అధ్యక్షుడు నూతి శ్రీకాంత్‌గౌడ్, నాయకులు సిరాజ్‌ఖాద్రీ, లక్ష్మణ్‌యాదవ్, గ్రామీణ వైద్య సేవకుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీనివాసులు, జిల్లా అధ్యక్షులు శ్రవణ్‌కుమార్, సురేందర్, నర్సింగ్‌రావు, సిద్దేశ్వర్, శివ రాజప్ప, భూషణ్, శేఖర్, గౌస్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

చికిత్స పొందుతూ ఉపాధ్యాయుడి మృతి


విజయ్‌కుమార్‌రెడ్డి (ఫైల్)

కల్వకుర్తి రూరల్: మండలంలోని తాండ్ర స్టేజి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ ప్రభుత్వ ఉపాధ్యాయుడు విజయ్‌కుమార్‌రెడ్డి చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందారు. గేటు సమీపంలో రోడ్డు దాటుతుండగా కల్వకుర్తి నుంచి దేవరకొండ వెళ్తున్న కారు వేగంగా వచ్చి ఇతడిని ఢీకొట్టడంతో విజయ్‌కుమార్‌రెడ్డి తలకు, కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించగా.. పరిస్థితి విషమించడంతో మృతిచెందారు.

లారీని ఢీ కొట్టిన మినీ ట్రావెల్ బస్సు : డ్రైవర్ మృతి



ఉండవెల్లి: మండలంలోని జాతీయ రహదారిపై ప్రయాణిస్తున్న మినీ బస్సు కంచుపాడు శివారులో ముందు ప్రయాణిస్తున్న లారీని ఢీ కొట్టడంతో మినీ బస్సు డ్రైవర్ సురేష్ అక్కడికక్కడే మృతిచెందినట్లు తెలిపారు. హెడ్ కానిస్టేబుల్ ప్రసాద్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. శుక్రవారం తెల్లవారుజామున బెంగళూరు నుంచి షాద్‌నగర్‌కు ప్రయాణిస్తున్న మినీ బస్సు జాతీయ రహదారిలో కంచుపాడు శివారులో ముందు వెళ్తున్న గుర్తుతెలియని లారీని ఢీకొట్టడంతో బస్సు నుజ్జునుజ్జు అయ్యింది. మినీ బస్సులోని డ్రైవర్ సురేష్(36) అక్కడికక్కడే మృతిచెందడు. హైవే అంబులెన్స్‌లో అలంపూర్‌కు తరలించారు. యజమాని రాజేష్‌కు గాయాలవడంతో కర్నూల్ ఆస్పత్రికి తరలించారు. సురేష్ తల్లి రాములమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ సుబ్బారెడ్డి తెలియజేశారు. తెల్లవారుజామున ప్రమాదం జరగడంతో వాహనాలను హైవే సిబ్బంది అదుపు చేసినట్లు తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

శాంతినగర్: వడ్డేపల్లి మండలంలోని జూలెకల్ శివారులో శుక్రవారం గుర్తుతెలియని మృతదేహం లభ్యమైంది. జూలెకల్ శివారులోని ఉత్తర ఫుడ్స్ కోళ్ల ఫారం సమీపంలోని ఓ రైతు పొలంలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని పోలీసులు కనుగొన్నారు. మృతుడి వయస్సు సుమారు 38 ఏళ్లు ఉంటాయని, తెలుపు, పింకు రంగు కలిగిన పంచె, నీలం రంగు డ్రాయర్, కుడి చేతికి రెండు వరుసల నల్లదారం కలిగి వున్నాడు. మృతదేహంపై ఎలాంటి గాయాలు లేనందున మతిస్థిమితం లేని వ్యక్తి అయి వుంటాడని పోలీసులు అనుమానం వ్యక్తం చేశారు. సదరు వ్యక్తిని గుర్తిస్తే సెల్ నం .8712670290కు సమాచారం ఇవ్వాలని శాంతినగర్ ఎస్‌ఐ సంతోష్ తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో మహిళ బలవన్మరణం

ఖిల్లాఘనపురం: ఆర్థిక ఇబ్బందులకుతోడు కుమారుడితో గొడవ పడిన ఓ మహిళ క్షణికావేశంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన మండలంలోని పర్వతాపురంలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు, గ్రామస్తుల కథనం మేరకు.. పర్వతాపురానికి చెందిన గోపాల్‌పేట మంగమ్మ(49) భర్త కొంతకాలం క్రితం మృతిచెందాడు. కుమారుడు రాముతో కలిసి తల్లి మంగమ్మ జీవిస్తోంది. అయితే, కుటుంబంలో ఆర్థిక ఇబ్బందులు తలెత్తడంతో తరచూ తల్లీ కుమారుడు గొడవ పడేవారు. ఈక్రమంలో శుక్రవారం కుమారుడు గ్రామంలోకి వెళ్లిన సమయంలో తల్లి మంగమ్మ ఇంటి పైకప్పు కొండికి చీరతో ఉరి వేసుకుంది. కొంత సేపటికి కుమారుడు ఇంటికి వచ్చి చూడగా.. అప్పటికే తల్లి ఉరివేసుకొని కనిపించింది. కన్నీరుమున్నీరు అవుతూ చుట్టుపక్కల వారి సహాయంతో కిందికి దించి చూడగా అప్పటికే మృతిచెందింది. కుమారుడు రాము ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు గోపాల్‌పేట ఎస్‌ఐ శివకుమార్, హెడ్‌కానిస్టేబుల్ బొట్టు శ్రీను తెలిపారు.

వెంకటాపురంలో చోరీ

అయిజ: మండలంలోని వెంకటాపురంలోని ఓ ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. ఎస్‌ఐ విజయభాస్కర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గురువారం కృష్ణారెడ్డి తన కూతురుని తీసుకుని కర్నూలులో బంధువుల శుభకార్యానికి వెళ్లారు. ఆయన భార్య పరిమళ ఎప్పటిలాగే టెక్స్‌టైల్స్ షాపులో వస్త్రాలను విక్రయించేందుకు వెళ్లింది. రాత్రి కర్నూలు నుంచి తిరిగి వచ్చిన కృష్ణారెడ్డి తన భార్య తోపాటు బైక్‌పై ఇంటికి వెళ్లారు. ఇంటి తలుపులు విరగొట్టి ఉండడంతో లోపలికి వెళ్లి చూశారు. బీరువాలో దాచిపెట్టిన 4.9 గ్రాముల బంగారం, రూ.1.20 లక్షల నగదు అపహరించినట్లు గుర్తించారు. పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి పంచనామా నిర్వహించారు. క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్‌లు వచ్చి పరిశీలించారు.



చదువుతోపాటు పరిశోధనలు

- డా.బీఆర్ఆర్ కళాశాల నుంచి జిజ్ఞాస రాష్ట్రస్థాయికి ఆరు పరిశోధనలు
- గతేడాది హిందీలో ద్వితీయ, తెలుగులో తృతీయ బహుమతులు
- ఈఏడాది రాష్ట్రస్థాయిలో ఆలోచింపజేస్తున్న పరిశోధనలు


జిజ్ఞాసలో రాష్ట్రస్థాయి ద్వితీయ బహుమతి సాధించిన హిందీ విభాగం విద్యార్థులు, అధ్యాపకులు (ఫైల్)

జడ్చర్ల టౌన్: డిగ్రీ కళాశాలల్లో విద్యార్థులను చదువుతోపాటు పరిశోధనల వైపు మళ్లించటం, వారిచే కొత్త ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టేందుకు కమిషనరేట్ ఆఫ్ కాలేజ్ ఎడ్యుకేషన్ (సీసీఈ) ప్రారంభించిన జిజ్ఞాసపై విద్యార్థులు ఆసక్తి కనబరుస్తున్నారు. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లోనూ ఏటా 13 విభాగాలలో 16 అంశాలపై పోటీలు నిర్వహిస్తుంది. ఒక్కో విభాగంలో పరిశోధన చేసే అంశం కోసం ఐదుగురు విద్యార్థులు ఒక మెంటర్ (సహకరించేందుకు అధ్యాపకుడు) ఉంటారు. 2016–17లో ప్రారంభించిన జిజ్ఞాస మొదట్లో జిల్లా స్థాయిలో అంశాలను అధ్యయనం చేసి వాటిలో ఎంపిక చేసినవి మాత్రమే రాష్ట్రస్థాయికి పంపేవారు. నాలుగేళ్లుగా రాష్ట్రంలోని 145 ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో రూపొందించిన అంశాలను నేరుగా సీసీఈకి పంపిస్తున్నారు. అక్కడ రూసా కార్యాలయంలో వచ్చిన అంశాలను ఎంపిక చేసి ప్రదర్శించే వెసులుబాటు కల్పిస్తున్నారు.

అంశాలపై పూర్తిస్థాయి పరిశోధనలు

కళాశాలల్లో విభాగాల నుంచి ఏదైనా ఒక అంశంపై విద్యార్థులే పూర్తిస్థాయిలో అధ్యయనం చేసి నివేదిక తయారు చేసి సీసీఈకి పంపించాల్సి ఉంటుంది. ఇందు కోసం క్షేత్ర పర్యటనలు, గ్రంథాలయాల్లో పుస్తక పఠనం, అధ్యాపకుల సహకారం తీసుకుంటారు. విద్యార్థులు తీసుకున్న అంశంపై చేసిన పరిశోధనను పుస్తక రూపంతోపాటు ఆరు నిమిషాల వీడియోలో క్లుప్తంగా పొందుపర్చి దానిని పంపించాల్సి ఉంటుంది. అలా పంపిన అంశాల్లో సీసీఈ నియమించిన ప్రొఫెసర్ల బృందం ఆమోదిస్తే రూసా కార్యాలయంలో దాన్ని ప్రదర్శిస్తూ వివరించాలి. 2023–24 విద్యాసంవత్సరానికి 145 ప్రభుత్వ డిగ్రీ కళాశాలల నుంచి 13 విభాగాల్లో మొత్తం 1,033 పరిశోధనలు సీసీఈ కార్యాలయానికి వచ్చాయి. వాటిలో 295 ఎంపిక య్యాయి.

బీఆర్ఆర్ డిగ్రీ కళాశాల నుంచి ఆరు పరిశోధనలు

డా.బీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి హిందీ, కామర్స్, సైన్స్, పొలిటికల్ సైన్స్, భౌతికశాస్త్రం, రసాయనశాస్త్రం, కంప్యూటర్‌సైన్స్ ఆరు విభాగాల నుంచి పరిశోధనలను సీసీఈకి పంపించగా అన్ని ఆమోదించబడ్డాయి. ఈనెల 3, 4 తేదీలు హైదరాబాద్ సీసీఈ కార్యాలయంలోని రూసాభవనంలో పరిశోధనలకు సంబంధించి విద్యార్థుల బృందాలు వేరు వేరుగా ప్రదర్శనలు ఇచ్చారు.


ఈ ఏడాది జిజ్ఞాస ప్రదర్శనకు హాజరైన కామర్స్ విద్యార్థుల బృందం

ఆలోచింపజేస్తున్న పరిశోధనలు

డిగ్రీ కళాశాల నుంచి పంపిన ఆరు పరిశోధనలు ప్రొఫెసర్ల బృందంతోపాటు అందరిని ఆలోచింపజేస్తున్నాయి. భౌతికశాస్త్రం విభాగం నుంచి అధునాతన ట్రాఫిక్ నియంత్రణ రోబోట్ అన్న అంశంపై చేసిన పరిశోధన ఆకట్టుకుంది. అలాగే పొలిటికల్ సైన్స్ విభాగం పరిశోధించిన ఓటర్ల ప్రవర్తనపై కులం, ధనం, సంక్షేమపథకాల పాత్ర (2023 అసెంబ్లీ ఎన్నికల్లో జడ్చర్ల నియోజకవర్గంపై పరిశోధన) ఆలోచింపజేసేదిలా మారింది. రసాయన శాస్త్రం విభాగం నుంచి మానవ ఆరోగ్యంపై సౌందర్యసాధనాల దుష్ప్రభావం అంశంపై పరిశోధించి ప్రదర్శించారు. హిందీ విభాగం నుంచి అమృత్‌మహోత్సవం హిందీ భాష ప్రాధాన్య (అధికార భాష హిందీకి 75ఏళ్లు) అంశంపై పరిశోధన చేసి ప్రదర్శించారు. వాణిజ్యశాస్త్రం నుంచి టీ టైం విశ్లేషణ చేసి ప్రదర్శించారు. ప్రభుత్వ ఉద్యోగాలపై ఆశలు పెట్టుకోకుండా స్వయం ఉపాధికల్పనలకు గల మార్గాలపై అధ్యయనం చేసి ప్రదర్శించారు. వీటితోపాటు కంప్యూటర్‌సైన్స్ విభాగం నుంచి విభాగ కార్యాచరణ నిర్వహణ పద్ధతులపై అధ్యయనం చేసి ప్రదర్శించారు.

బహుమతులు

2022–23 విద్యాసంవత్సరానికి గాను జిజ్ఞాస ప్రదర్శనలో రాష్ట్రంలో హిందీ, తెలుగు విభాగాలు ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించారు. హిందీ భాష అభివృద్ధిలో సమాచార ప్రసార సాంకేతిక పరిజ్ఞానం తోడ్పాటు అన్న అంశంపై ద్వితీయ బహుమతి సాధించి రూ.20వేల నగదు పొందారు. అలాగే మూలధ్వని పేరుతో జానపద గిరిజన, సంగీత వాయిద్యాల సామాజిక చరిత్ర పరిశోధనకు తెలుగులో రూ.15వేల బహుమతి లభించింది.

సంక్షేమ పథకాల ప్రభావం



2023 అసెంబ్లీ ఎన్నికల్లో జడ్చర్ల నియోజకవర్గంలో కులం, మతం, మద్యం, డబ్బు ప్రభావంపై పరిశోధన చేశాం. కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీల్లో మహాలక్ష్మి, రైతుభరోసా పథకాలు ప్రజలను విశేషంగా ఆకట్టుకున్నాయి. బీఆర్ఎస్ ప్రభుత్వ పథకాలు 96శాతం బాగున్నాయని తేల్చినా కుటుంబ పాలన అన్న కారణంగా ఓటర్లు వ్యతిరేకత చూపారని తేలింది. అలాగే ఓటర్లకు ఓటుపై పూర్తి అవగాహన ఉందని మాకు తెలిసింది. చదువుతోపాటు ఇలా పరిశోధనల వైపు వెళ్లటానికి జిజ్ఞాస ద్వారా అవకాశం రావటం మాలోని సృజనాత్మకత వెలుగులోకి వచ్చింది.

–లక్ష్మీప్రసన్న, బీఏ, మొదటి సంవత్సరం

హిందీపై పూర్తి అధ్యాయనం



స్వతహాగా మాది యూపీ రాష్ట్రం. అయినప్పటికీ హిందీ భాష గురించి పూర్తి స్థాయిలో జిజ్ఞాసకు వెళ్లటం ద్వారానే తెలుసుకోగలిగాను. కేంద్ర ప్రభుత్వ అధికారిక భాష హిందీ అయినప్పటికీ దాని ప్రాముఖ్యత చాలా మందికి తెలియకుండా ఉంది. మా పరిశోధన ద్వారా ప్రపంచంలో అత్యధికంగా మాట్లాడే భాషల్లో హిందీ ఒకటని తెలుసుకోగలిగాం. కృత్రిమ మేధ ద్వారా హిందీని 20 భాషల్లోకి తర్జుమా చేసే సాంకేతిక పరిజ్ఞానం త్వరలోనే అందుబాటులోకి రానుంది. ఒక అంశం తీసుకుని దానిపై ఎలా అధ్యయనం చేయవచ్చో తెలియవచ్చింది. భవిష్యత్‌లో మరిన్ని అంశాలపై పరిశోధన చేసే ఆసక్తి పెరగటంతోపాటు పది మంది ముందు మాట్లాడే భయం పోయింది.

– వైష్ణవి, డిగ్రీ మొదటి సంవత్సరం

స్వయం ఉపాధి వైపు..



చదివితే ఉద్యోగం వస్తుందనే భ్రమలు పోయి, స్వయం ఉపాధి కల్పించుకునేందుకు అనేక మార్గాలున్నాయని పరిశోధన ద్వారా తెలుసుకోగలిగాను. ఒక అంశం తీసుకుని దానిని లోతుగా అధ్యయనం చేయటం ఎలా అని తెలుసుకున్నాను. అలాగే మాలో దాగి ఉన్న సృజనాత్మకత వెలికి తీసి అన్వేషించే గుణం తెలిసింది. రెండు తెలుగు రాష్ట్రాల్లో టీ టైం ఫ్రాంచైజీల ద్వారా ఎంతో మంది ఉపాధిని ఏర్పరచుకున్నారని తెలుసుకున్నా. భవిష్యత్ అంతా అలాంటి ఫ్రాంచైజీలదే. ప్రాచుర్యం కలిగిన బ్రాండ్ ఫ్రాంచైజీ తీసుకుంటే ఉపాధికి డోకా ఉండదని పరిశోదన చేసి ప్రదర్శించాను.

–నిఖిల్, బీకాం తృతీయ సంవత్సరం

విద్యార్థుల ఆసక్తి..



విద్యార్థులను చదువుకే పరిమితం చేయకుండా పరిశోధనలవైపు మళ్లించే లక్ష్యంతో సీసీఈ 2016–17లో జిజ్ఞాసను ప్రారంభించింది. డా.బీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి 2022–23 విద్యా సంవత్సరంలో ఆరు అంశాలపై పరిశోధనలు పంపించగా హిందీ, తెలుగు విభాగాలకు బహుమతులు వచ్చాయి. విద్యార్థులు ఒక అంశాన్ని తీసుకుని దానిపై అధ్యయనం చేయటానికి ఆసక్తి చూపుతున్నారు. వారిలో సృజనాత్మకత, అన్వేషిత్వం, ప్రతిభకు పదును పెడుతున్నారు. ఈ ఏడాది ఆరు విభాగాల నుంచి పంపిన అంశాలు అన్ని ఎంపికై విద్యార్థులు ప్రదర్శించటం పూర్తయ్యింది. 15రోజుల్లో ఫలితాలు రానున్నాయి.

– డా.నరసింహ్మారావుకల్యాణి, జిజ్ఞాస కో ఆర్డినేటర్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల

బంజారాల సంస్కృతిపై అధ్యయనం


లింగాలలో బంజారాల సంస్కృతి గురించి తెలుసుకుంటున్న మహారాష్ట్ర బృందం

లింగాల: నల్లమల ప్రాంతంలోని గిరిజనులైన బంజారాల సంస్కృతి, సాంప్రదాయాలపై మహారాష్ట్ర నుంచి వచ్చిన బృందం అధ్యయనం నిర్వహించింది. బంజారాల ఆరాధ్య దైవమైన సంత్ సేవాలాల్ మహారాజ్ జన్మస్థలమైన గోరియాఘడ్ నుంచి మమత అనే మహిళ నేతృత్వంలోని బృందం శుక్రవారం మండల కేంద్రంలోని పలువురు పెద్దలను కలిసి ఈ ప్రాంత ప్రాశస్త్యం గురించి తెలుసుకున్నారు. విభిన్న కులాలు ఉన్న ఈ ప్రాంతంలోని ఆయా కులాల సాంప్రదాయాలు, వారి స్థితిగతుల గురించి ఆరా తీశారు. గత సెటిల్‌మెంట్ కాలంలో పరిస్థితులు, నేటి పరిస్థితులు ఎలా ఉన్నాయనే దానిపై అనాటి తరం వారితో పలు విషయాలను తెలుసుకున్నారు. మండల కేంద్రంలో సెటిల్‌మెంట్ కాలంలో నిర్మించిన తపాలా కార్యాలయం, ఉన్నత పాఠశాల, పాత జైల్‌ఖానా, శిథిలావస్థకు చేరిన గత కట్టడాలపై డాక్యుమెంటరీ తీశారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ రాంకోటి,శివరావు, బాలాజీ, లక్ష్మినర్సు, దేశ్యానాయక్, రాందాస్,రాజు, వెంకటయ్య, శంకర్, ఇందిరమ్మ పాల్గొన్నారు.

తనిఖీల్లో నగదు సీజ్

మహబూబ్‌నగర్ క్రైం: జిల్లా కేంద్రంలో న్యూటౌన్‌లో శుక్రవారం టూటౌన్ పోలీసుల చేసిన తనిఖీల్లో మహబూబ్‌పాషా వద్ద రూ.2.50లక్షల నగదు పోలీసులు సీజ్ చేశారు.

బాలానగర్: మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన పోలీస్ చెక్‌పోస్టులో రూ.లక్ష నగదును పోలీసులు సీజ్ చేశారు. హైదరాబాద్ నుంచి వెఎస్సార్ జిల్లా మైలవరంకు వెళ్తున్న నక్క గురుశేఖర్ వద్ద నగదు లభించినట్లు పోలీసులు తెలిపారు.

మద్యం పట్టివేత..

ఉండవెల్లి: మండలంలోని పుల్లూరు, డీ.బూడిదపాడు శివారులో వేర్వేరు చోట్ల శుక్రవారం మద్యం పట్టుకుని కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ ప్రసాద్ తెలిపారు. హెడ్‌కానిస్టేబుల్ తెలిపిన వివరాల ప్రకారం.. ఫ్లయింగ్ స్క్వాడ్స్ గురువారం మధ్యరాత్రి బెల్ట్ షాపుల తనఖీలో 232.58 లీటర్ల మద్యం పట్టుకుని పోలీస్ స్టేషన్‌లో అప్పగించినట్లు తెలిపారు. పుల్లూరుకు చెందిన నరేష్ ఇంట్లో రూ.83,450 విలువ గల మద్యం లభించింది. కర్నూల్ జిల్లా ఈ.తాండ్రపాడు చెందిన తెలుగు చిన్న అలియాస్ బురుబురు చిన్న ద్విచక్ర వాహనంపై 39.42 లీటర్ల మద్యాన్ని తరలిస్తుండగా పట్టుకున్నారు. దాని విలువ రూ.32,559 ఉంటుందని అంచనా వేశారు. ఇద్దరిపై ఏఎస్‌ఐ సుబ్బారెడ్డి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

గుడిసెకు నిప్పంటుకొని వ్యక్తికి తీవ్రగాయాలు

- ఆవు, లేగదూడ మృతి, మిగతా ఆవులకు తీవ్ర గాయాలు

కోయిల్‌కొండ: మండలంలోని మల్కాపూర్‌లో ప్రమాదవశాత్తు గుడిసెకు నిప్పంటుకొని దగ్ధమైన సంఘటనలో వ్యక్తికి తీవ్ర గాయాలు కాగా, ఆవు, లేగదూడ మృతిచెందిన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన చంద్రయ్యగౌడ్ వ్యవసాయ పొలంలోని గుడిసెలో రెండు లేగ దూడలు, ఐదు ఆవులు ఉన్నాయి. ప్రమాదవశాత్తు గుడిసె నిప్పంటుకొని దగ్ధం కావడంతో అందులోని పశువులకు తీవ్ర గాయాలయ్యాయి. అక్కడే ఉన్న రైతు చంద్రయ్యగౌడ్ ఆవులను కాపాడేందుకు గుడిసెలోకి వెళ్లగా ఆయనకు మంటలు అంటుకొని తీవ్ర గాయాలపాలయ్యాడు. గుడిసెలోని ఐదు ఆవుల్లో ఒకటి మృతిచెందగా.. రెండు లేగదూడల్లో ఒకటి మృతిచెందింది. మిగితా పశువులకు తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు వెంటనే చికిత్స నిమిత్తం చంద్రయ్యగౌడ్‌ను జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా.. అక్కడ చికిత్స పొందుతున్నాడు. 25 శాతం శరీరం కాలిపోయిందని వైద్యులు తెలిపినట్లు కుటుంబ సభ్యులు తెలియజేశారు. నష్టపోయిన చంద్రయ్యగౌడ్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

మొక్కు తీర్చుకునేందుకు వెళ్తూ..

- బొలెరో వాహనం బోల్తా.. ఇద్దరి దుర్మరణం
- మరో ఐదుగురికి గాయాలు
- ఏపీలోని మద్దిలేటిస్వామిని దర్శించుకునేందుకు వెళ్తుండగా ఘటన


బోల్తాపడిన బొలెరో వాహనం



మృతిచెందిన బాలుడు మనోజ్, నాగప్ప

అయిజ: మొక్కు తీర్చుకునేందుకు బంధువులతో కలిసి వెళ్తుండగా చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం చెందగా.. మరికొందరికి గాయాలయ్యాయి. ఈ ఘటన అయిజ మండలంలోని ఉత్తనూరు సమీపంలో శుక్రవారం చోటుచేసుకుంది. బాధిత కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కర్ణాటక రాష్ట్రం రాయచూరు జిల్లా మిర్జాపరం గ్రామస్తులు, గట్టు మండలం చిన్నోనిపల్లి గ్రామస్తులు కలిసి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కర్నూలు జిల్లాలో వెలసిన మద్దిలేటిస్వామిని దర్శించుకొని మొక్కు చెల్లించుకునేందుకు సిద్ధమయ్యారు. ఈమేరకు మొత్తం ఎనిమిది బొలెరో వాహనాల్లో వంద మందికిపైగా వారి సొంత గ్రామాల నుంచి శుక్రవారం బయల్దేరారు. అయితే, అయిజ మండలం ఉత్తనూరు గ్రామ సమీపంలోకి రాగానే ఒక బొలెరో వాహనానికి చెందిన ఎక్స్‌ఎల్ రాడ్ ఊడిపోవడంతో వాహనం అదుపుతప్పి రోడ్డుపక్కన బోల్తా పడింది. దీంతో వాహనంలో ఉన్న మిర్జాపురం గ్రామానికి చెందిన నాగప్ప (45), చిన్నోనిపల్లికి చెందిన బూసి నాగప్ప, లక్ష్మి దంపతుల కుమారుడు మనోజ్ (10)కు తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం వీరిని కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో ఇరువురు మృతిచెందారు. ఇక రంగప్ప, రమేష్, శ్రీచందన, ధనుష్, మహేశ్వరి గాయపడగా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ ప్రమాదంతో బంధువులంతా శోకసంద్రంలో మునిగారు. మృతుడు మిర్జాపురం నాగప్పకు భార్య నర్సమ్మ, కూతురు, కుమారుడు ఉన్నారు. పోలీసులు పోస్టుమార్టం నిర్వహించి దర్యాప్తు చేస్తున్నారు.

హత్య చేసి.. మృతదేహానికి నిప్పంటించి

- నారాయణపేటలో సంచలనం సృష్టించిన ఘటన


ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ లింగయ్య

నారాయణపేట రూరల్: ఓ వ్యక్తిని బండ రాయితో మోది హత్య చేయడంతో పాటు.. ఎవరూ గుర్తుపట్టకుండా చేసేందుకు నిప్పంటించారు. సంచలనం సృష్టించిన ఈ ఘటన నారాయణపేటలో గురువారం రాత్రి చోటుచేసుకుంది. డీఎస్పీ లింగయ్య తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని పళ్ళవీధికి చెందిన దాసరి మారుతి (40) గత కొన్నేళ్లుగా హైదరాబాద్‌కు వలస వెళ్లి అక్కడే కూలి పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. నాలుగు రోజుల క్రితం నారాయణపేటకు వచ్చిన ఆయన గురువారం రాత్రి నుంచి కనిపించకుండా పోయాడు. అయితే శుక్రవారం తెల్లవారుజామున ప్రభుత్వ ఆస్పత్రి వెనకబాగంలోని శాతవాహన కాలనీలో ఓ వ్యక్తి మృతదేహాన్ని చూసిన కొందరు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు ఆ వ్యక్తిని గుర్తు తెలియని వ్యక్తులు రాయితో కొట్టి చంపినట్లు ప్రాథమికంగా గుర్తించారు. అనుమానం రాకుండా నిప్పు పెట్టినట్లు అనుమానిస్తున్నారు. విషయం తెలుసుకున్న డీఎస్పీ లింగయ్య అక్కడికి చేరుకుని వెంటనే క్లూస్ టీమ్, డాగ్ స్క్వాడ్ బృందాలను రంగంలోకి దించారు. అంతలోనే మృతుడి కుటుంబ సభ్యులు అక్కడికి చేరుకుని మారుతిగా గుర్తించారు. కాగా కూలి పని చేసుకునే వ్యక్తిని హతమార్చాల్సిన అవసరం ఎవరికి ఉందని, ఏమైన తగాదాలు ఉన్నాయా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. హత్య జరిగిన ప్రదేశంలో సీసీ కెమెరాల పుటేజీలను పరిశీలిస్తున్నారు. త్వరితగతిన విచారణ చేపట్టి నేరం చేసిన వారిని పట్టుకుంటామని డీఎస్పీ వెల్లడించారు.

అదృశ్యమైన వృద్ధుడు.. శవమై కనిపించాడు


దోకూర్ బాలస్వామి (ఫైల్)

కొత్తకోట రూరల్: కొన్నిరోజుల క్రితం అదృశ్యమైన ఓ వృద్ధుడు తాజాగా శవమై కనిపించాడు. పూర్తి వివరాలిలా.. కొత్తకోటలోని దండుగడ్డ కాలనీకి చెందిన జయప్రకాష్ కులకర్ణి ఇంటి వద్ద వాచ్‌మెన్ కావాలని అప్పరాకి చెందిన లక్ష్మీనారాయణ అనే వ్యక్తిని అడగగా అదే గ్రామానికి చెందిన డోకూర్ బాలస్వామి (65)ని తీసుకువచ్చి కొత్తకోటలోని జయప్రకాష్ ఇంటి వద్ద నెల జీతం మాట్లాడి గత నెల 25న వదిలి వెళ్లాడు. 26న ఉదయం వాచ్‌మెన్ బాలస్వామి కనిపించకపోవడంతో యజమాని జయప్రకాష్ కులకర్ణి అప్పరాలలోని లక్ష్మీనారాయణకు ఫోన్ చేసి విషయం చెప్పడంతోపాటు గ్రామానికి వెళ్లి వెతకగా కనిపించలేదు. ఈ మేరకు ఇంటి యజమాని ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. శుక్రవారం ఉదయం వడ్డెవాట గ్రామ శివారులోని దేవబండ(గుట్ట) వద్ద గుర్తు తెలియని మృతదేహాన్ని సమీప పొలాల రైతులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంఘటన స్థలానికి చేరుకున్న ఎస్‌ఐ మంజునాథ్‌రెడ్డి బాలస్వామి కుమారులకు సమాచారం చేరవేశారు. వారు అక్కడికి చేరుకొని తమ తండ్రిదేనని గుర్తించారు. తప్పిపోయిన రోజు కాలినడకన గ్రామానికి వస్తుండగా వయస్సు రిత్యా, ఎండ తీవ్రతకు గుట్టపై చెట్టుకింద సేదతీర్చుకునేందుకు వెళ్లి శరీరం సహకరించక పడుకొని అక్కడే చనిపోయినట్టు పోలీసులు, బంధువులు ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు.

మహిళ మృతిపై కేసు నమోదు

అడ్డాకుల: మండలంలోని గుడిబండ గ్రామంలో మహిళ మృతి చెందిన ఘటనపై ఆమె కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ఎం.శ్రీనివాస్ తెలిపారు. గ్రామానికి చెందిన పానుగంటి లక్ష్మి(45) గురువారం అనుమానాస్పదంగా మృతి చెందడంతో శుక్రవారం ఆమె కుమారుడు ఠాణాలో ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. పంచనామా అనంతరం మృతదేహాన్ని శవపరీక్షల నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

యూట్యూబ్ చూసి రూ.9.73 లక్షలు పోగొట్టుకున్నాడు


వివరాలు వెల్లడిస్తున్న సీఐ నాగభూషన్‌రావు

గోపాలపేట: తన కుమారుడు అనారోగ్యం బారినపడటంతో మతిస్థిమితం కోల్పోవడంతో తండ్రి యూట్యూబ్‌లో తాంత్రిక వీడియోలు చూశాడు. ఈ క్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని గుంటూరుకు చెంది ముగ్గురు వ్యక్తులు పరిచయమై బాగు చేస్తామని నమ్మబలికారు. వారిని నమ్మి వైద్యం చేయించడంతోపాటు రూ.9.73 లక్షలు పోగొట్టుకున్నాడు. చివరికి మోసపోయానని గ్రహించి పోలీసులకు ఫిర్యాదు చేసిన ఘటన వనపర్తి జిల్లా గోపాల్‌పేట మండలంలో చోటుచేసుకుంది. వనపర్తి సీఐ నాగభూషన్‌రావు కథనం ప్రకారం.. గోపాల్‌పేటకు చెందిన కందూరు రాజు కుమారుడు వెంకటేష్ అనారోగ్యం బారినపడి మతిస్థిమితం కోల్పోయాడు. అయితే మతిస్థిమితం సరిగా లేకుంటే బాగు చేస్తామని యూట్యూబ్‌లో తాంత్రిక వీడియోలు చూసిన రాజు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని గుంటూరుకు వెళ్లి ముగ్గురిని కలిశాడు. బాగు చేస్తామని చెప్పి నమ్మించి విజయవాడలో రాజు కుమారుడికి క్షుద్రపూజలు చేయించారు. ఇందుకోసం వివిధ సందర్భాల్లో బాధితుల నుంచి రూ.9.73 లక్షలు వసూలు చేశారు. ఎంతకూ వెంకటేష్ ఆరోగ్యం బాగు కాకపోవడంతో పలుమార్లు ఫోన్ చేశారు. అయితే సదరు వ్యక్తులు సరిగా సమాధానం ఇవ్వకుండా దాటవేశారు. దీంతో బాధితులు గత నెల 20న గోపాల్‌పేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసిన పోలీసులు గుంటూరు వెళ్లి ముగ్గురు నిందితులు సిరిగిరి గోపి, సిరిగిరి వెంకన్న, మన్యంను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వారి నుంచి రూ.7 లక్షలు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. విజయవాడకు వెళ్లి నిందితులను చాకచక్యంగా పట్టుకున్న ఎస్‌ఐ హరిప్రసాద్, కానిస్టేబుళ్ల వంశీ, అంజి, రాజేష్‌లను సీఐ అభినందించారు.

గంజాయి మత్తులోని యువకులను పోలీసులకు అప్పగింత

అమ్రాబాద్: గంజాయి మత్తులో ఉన్న ఇద్దరు యువకులను పట్టుకుని పోలీసులకు అప్పగించిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అమ్రాబాద్ మండలం తుర్కపల్లిలో బుధవారం రాత్రి ఇద్దరు యువకులు అనుమానాస్పదంగా తిరుగుతున్నారు. మిరపకాయల దొంగతనానికి వచ్చారని పరిసర రైతులు వెంబడించారు. మత్తులో ఉన్న వారిని పట్టుకొని ప్రశ్నించగా.. ఓ రైతు పొలంలో గంజాయి ఉందని తెలిసి వచ్చామని తెలియజేశారు. వారి వద్ద అర కిలో వరకు గంజాయి ఆకులు ఉన్నట్లు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ విషయంపై ఎస్‌ఐ రమేష్‌ను వివరణ కోరగా.. గ్రామస్తుల తెలిపిన సమాచారం మేరకు శుక్రవారం తుర్కపల్లిలో వ్యవసాయ పొలంలో పరిశీలించగా.. ఎనుపోతుల నారాయణ అనే రైతు కౌలుకు తీసుకొని సాగు చేసిన మిర్చి పంటలో ఐదు గంజాయి మొక్కలు గుర్తించామని చెప్పారు. ఈ విషయంపై కేసు నమోదు చేశామని వివరించారు.

ఆరోగ్యానికి 6 రుచులు



త్వరలో ఉగాది వస్తోంది. ఆరు రుచులున్న ఉగాది పచ్చడిని ఈ రోజు తప్పనిసరిగా సేవించడం ఈ పండగ ఆచారం. ఉగాది రోజున షడ్రుచుల సమ్మేళనం అయిన ఉగాది పచ్చడి సేవిస్తే ఆయా రుచుల్లాగే సంవత్సరమంతా మనకు ఆయా ఫలాలు అందుతాయని, అలా రకరకాల అనుభవాలూ, అనుభూతులను ఆస్వాదించడమే జీవితమని పెద్దలు చెబుతారు. అయితే అలా కేవలం ఉగాది నాడు మాత్రమే కాదు, వీలయితే ప్రతిరోజూ ఆరు రుచుల ఆహారాలను తీసుకోవడం వల్ల మనం ఆరోగ్యంగా ఉండచ్చని ఆయుర్వేదం చెబుతోంది. ఏయే రుచులు ఉన్న ఆహారాలను తీసుకోవడం వల్ల మనకు ఎలాంటి లాభాలు కలుగుతాయో తెలుసుకుందాం.




1. తీపి

శరీరంలోని వాత, పిత్త దోషాలను ఈ రుచి సమం చేస్తుంది. తీపి పదార్థాలను తీసుకోవడం వల్ల ఆయుర్దాయం పెరుగుతుంది, శరీరం దృఢంగా మారుతుంది. శక్తి అందుతుంది. శరీరంలో ద్రవాలు సమతుల్యంలో ఉంటాయి. అయితే వీటిని చాలా తక్కువగా తినాలి. లేదంటే శరీరంలో కఫ దోషం పెరుగుతుంది. ఫలితంగా అధిక బరువు, స్థూలకాయం, డయాబెటిస్ వంటి వ్యాధులు వస్తాయి. కనుక ఈ రుచి ఉన్న ఆహారాలను నిత్యం తక్కువ మోతాదులో తీసుకుంటే ఆరోగ్యంగా ఉండవచ్చు.



2. పులుపు

వాత దోషాలను పులుపు తగ్గిస్తుంది. పులుపు రుచి ఉన్న ఆహారాలను తినడం వల్ల ఆకలి పెరుగుతుంది. జీర్ణ సమస్యలు ఉండవు. నిమ్మ, చింతకాయ వంటి పులుపు ఉన్న ఆహారాలను నిత్యం పరిమితంగా తీసుకోవచ్చు. అయితే ఎక్కువగా తీసుకుంటే పిత్త, కఫ దోషాలు పెరుగుతాయి. కనక పులుపు ఆహారాలను కూడా తక్కువగా తీసుకోవాలి.



3. ఉప్పు

ఉప్పు ఉన్న ఆహారాలను తీసుకోవడం వల్ల వాత దోషం తగ్గుతుంది. ఉప్పు అధికమైతే పిత్త, కఫ దోషాలు పెరుగుతాయి. ఉప్పు ఉన్న ఆహారాల వల్ల జీర్ణ శక్తి పెరుగుతుంది. కణాలు శుభ్రమవుతాయి. ఉప్పు ఉన్న పదార్థాలను కూడా తక్కువగా తీసుకోవాలి. ఎక్కువైతే బీపీ పెరుగుతుంది. గుండె జబ్బులు వస్తాయి.



4. కారం

కారపు రుచి గల ఆహారాలను తీసుకుంటే జీర్ణశక్తి పెరుగుతుంది. ఆకలి వేస్తుంది. కణాలు శుభ్రమవుతాయి. రక్త సరఫరా మెరుగు పడుతుంది. కఫ దోషం తగ్గుతుంది. కారం ఎక్కువైతే పిత్తదోషం పెరుగుతుంది. అందు వల్ల కారాన్ని నిత్యం తక్కువగానే తీసుకోవాలి.



5. చేదు

చేదుగా ఉన్న పదార్థాలను తినడం వల్ల శరీరంలోని వ్యర్థాలు బయటకు వెళ్లిపోతాయి. శరీరం అంతర్గతంగా శుభ్రంగా మారుతుంది. పిత్త, కఫ దోషాలు తగ్గుతాయి. చేదుగా ఉన్న పదార్థాలను నిత్యం కొద్దిగా ఎక్కువ మోతాదులో తీసుకున్నా పెద్దగా సమస్యలు ఉత్పన్నం కావు.

6. వగరు

వగరు ఉన్న పదార్థాలను కూడా నిత్యం తినాలి. కానీ వీటిని తక్కువగా తీసుకోవాలి. లేదంటే జీర్ణాశయంలో గ్యాస్ ఎక్కువగా ఉత్పత్తి అవుతుంది. ఇక పిత్త దోషం ఉన్న వారికి ఈ రుచి ఉన్న పదార్థాలు ఎంతగానో మేలు చేస్తాయి. పచ్చి అరటి పండ్లు, క్రాన్ బెర్రీలు, గ్రీన్ బీన్స్ వంటివి ఈ రుచి ఉన్న పదార్థాలకు ఉదాహరణలుగా చెప్పవచ్చు.

అయితే భోజనం చేసేటప్పుడు ఒకేసారి ఆరు రుచులు కలిసిన పదార్థాలను తినాల్సిన పనిలేదు. రోజులో మొత్తంగా చూసుకుంటే ఈ ఆరు రుచులు ఉన్న పదార్థాలను తిన్నామా లేదో అని చెక్ చేసుకుంటే చాలు. ఉదయం, మధ్యాహ్నం, రాత్రి భోజనాల్లో ఈ ఆరు రుచుల నుంచి ఏవైనా రెండు రుచులు కలిగిన ఆహారాలను ఎంచుకుని తింటే చాలు. అంటే ఉదయం చేదు, కారం, మధ్యాహ్నం తీపి, వగరు, రాత్రి పులుపు, ఉప్పు.. ఇలా రెండేసి రుచులు ఉండేలా ఆహారాలను తీసుకుంటే చాలు. ఇవే తినాలని ఏమీ లేదు. ఎవరికి నచ్చినట్లు వారు ఆహారాలను ఎంచుకుని ఆరు రుచులు కవర్ అయ్యేలా చూసుకుంటే చాలు.


హెల్త్ టిప్స్

- రోజూ కప్పు నల్ల ద్రాక్ష రసం తీసుకుంటే గుండెపోటుకు దూరంగా ఉండవచ్చు.
- పడుకునేటప్పుడు ఎడమ పక్కకు తిరిగి పడుకుంటే ఎసిడిటి రాదు.
- 10 తులసి ఆకుల రసం ఒక కప్పు చొప్పున రెండు పూటలా తీసుకుంటే చర్మ వ్యాధులు, రాషెస్ కు సంబంధించి వెంటనే ఫలితం కనిపిస్తుంది.
- రెండు స్పూన్లు ఉసిరి రసం, తేనెను అర కప్పు నీటిలో బాగా కలిపి 3 పూటలా సేవిస్తే బీపీ తగ్గుముఖం పడుతుంది.

మీకు తెలుసా?

'రోజు ఒక కప్పు ఉడకబెట్టిన శనగలు తింటే...
- గుండె జబ్బులు దరిచేరవు.
- రోజంతా ఉత్సాహంగా ఉంటారు.
- కాలేయం సమస్యల నుంచి త్వరగా కోలుకుంటారు.
- ఒత్తిడి, ఆందోళన దూరం అవుతాయి.
- జీర్ణ సమస్యలు తగ్గుతాయి.
- ఎముకలు దృఢంగా మారుతాయి.
- రక్త సరఫరా మెరుగుపడి బీపీ అదుపులో ఉంటుంది.

వేసవి తాపానికి కర్బూజ పండు



వేసవిలో మనకు విరివిగా దొరికే పండు కర్బూజ. ఈ పండులో అనేక రకాల ఆరోగ్య ప్రయోజనాలు దాగి ఉన్నాయి. కర్బూజ పండులో దాదాపు తొంభై శాతం నీరు ఉంటుంది. కాబట్టి వేసవి తాపాన్ని తగ్గించుకోవడానికి, వేసవిలో శరీరం కోల్పోయే నీటి శాతాన్ని భర్తీ చేయడానికీ కర్బూజ పండు బాగా ఉపయోగపడుతుంది. కర్బూజ ముఖ్యంగా శరీరంలోని వేడిని, అధిక రక్త పోటుని తగ్గిస్తుంది. ఈ పండులో ఉన్న పోషక విలువలేంటో తెలుసుకుందాం.

- కర్బూజ పండులో ఎక్కువ శాతం ఉండే బీటాకెరోటిన్ క్యాన్సర్‌కు దారితీసే ఫ్రీ–రాడికల్స్‌ని తొలగిస్తుంది. దీనిలో ఉన్న విటమిన్ సి రోగ నిరోధక శక్తిని పెంచడంతోపాటు శరీరంలో తెల్ల రక్త కణాలు వృద్ధి చెందేలా చేసి రక్తంలో ఇన్ఫెక్షన్స్ రాకుండా కాపాడుతుంది.
- కర్బూజ లో విటమిన్ ఎ అధికంగా ఉంటుంది. ఇది కంటి సంబంధిత సమస్యలను దూరం చేసి కంటిచూపు బాగా ఉండేలా చేస్తుంది. వడదెబ్బ నుండి రక్షిస్తుంది.
- కర్బూజ పండులో విటమిన్ కె, విటమిన్ ఇ సమృద్ధిగా ఉంటాయి. దీనివల్ల ప్రత్యుత్పత్తి వ్యవస్థ బాగా పనిచేస్తుంది. అంతేకాకుండా రక్త ప్రసరణ చక్కగా జరిగేలా ఉపయోగపడుతుంది.
- కర్బూజలో అధిక మోతాదులో ఉండే పొటాషియం గుండెకు మంచి న్యూట్రియన్స్‌ని అందజేస్తుంది. దీనిలో ఫోలెట్ ఉండటం వలన అది హార్ట్ ఎటాక్ నుండి మరియు గుండె జబ్బుల నుండి కాపాడుతుంది.
- ఖర్బూజలో తక్కువ క్యాలరీస్ కలిగి ఎక్కువగా పీచు పదార్థం ఉండటం వలన అధిక బరువుని తగ్గిస్తుంది.
- కర్బూజ రసం తాగడం వల్ల మెదడుకి ఆక్సిజన్ సరఫరా బాగా జరిగి, ఒత్తిడి తగ్గి నిద్ర బాగా పడుతుంది. ఈ జ్యూస్‌ని క్రమం తప్పకుండా సేవిస్తే రక్తంలోని చక్కెర శాతాన్ని తగ్గిస్తుంది.
- ఈ పండు కిడ్నీలో రాళ్లను సైతం కరిగిస్తుంది. జీర్ణశక్తిని మెరుగు పరుస్తుంది. ఈ పండులో ఫోలిక్ యాసిడ్ సమృద్ధిగా ఉండడం వలన గర్భిణులకు ఎంతో మేలు చేస్తుంది. బిడ్డ ఎదుగుదలకు బాగా తోడ్పడుతుంది.
- కంటి ఆరోగ్యాన్ని మెరుగు పరచడానికి, శ్లేష్మాన్ని తగ్గించడానికి కర్బూజా సహాయపడుతుంది.



వేసవిలో కర్బూజ పండు ముక్కలతో పాటు జ్యూస్ తాగటం వల్ల మెరుగైన ఆరోగ్యం పొందవచ్చు.



వడదెబ్బ ముందే జాగ్రత్త పడదాం...

ఇంకా ఏప్రిల్ మొదటివారంలోనే ఉన్నాం. అప్పుడే ఎండలు మండిపోతున్నాయి. వివిధ వృత్తి ఉద్యోగ వ్యాపారాల రీత్యా రోజూ ఎండలోకి వెళ్లక తప్పనివారిని వేధించే సమస్య వడదెబ్బ. ఈ నేపథ్యంలో వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ఆరోగ్య నిపుణులు, అనుభవజ్ఞులు చెప్పిన చిట్కాలు కొన్ని...

ముందు జాగ్రత్తలు

ఎండల ధాటికి వడదెబ్బ ప్రభావం శరీరంపై పడే అవకాశం ఉంది, శరీరంలో నీటి శాతం తగ్గితే, వడదెబ్బ తగులుతుంది, అందువల్ల వేసవిలో శరీరంలో నీటిశాతం తగ్గకుండా చూసుకోవాలి, ఎండలో తిరగటంతో రక్తకణాలు కుచించుకుపోతాయి. దీనిమూలంగా కిడ్నీలు, లివర్ దెబ్బతింటాయి. అందువల్ల కొన్ని రకాల జాగ్రత్తలు పాటించడం అవసరం. ● ఎండలో బయటకు వెళ్లేటప్పుడు తలకు క్యాప్ పెట్టుకోవాలి. గొడుగు తీసుకెళ్లాలి ● రోజుకు ఐదారు లీటర్లకు తగ్గకుండా నీరు తాగాలి ● సమయానికి తగిన ఆహారం తీసుకోవాలి ● ఉప్పు కలిపిన ద్రవాలు తాగాలి ● వదులైన కాటన్ దుస్తులు ధరించాలి ● కొబ్బరి బోండాం, మజ్జిగ తాగుతుండాలి ● బయటకు వెళ్లేప్పుడు తప్పకుండా సన్‌గ్లాసెస్ పెట్టుకోవడం, నీళ్ల సీసా తీసుకెళ్లడం తప్పనిసరి. ● మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఎండలో తిరగకూడదు ● కీరదోస ముక్కల్ని ఎక్కువగా తినడం వల్ల శరీరానికి నీటితోపాటు పోషకాలు కూడా అందుతాయి. ● శరీరంలో నీటి శాతాన్ని పెంచే పుచ్చకాయ, కొబ్బరినీళ్లు తాగాలి ● వడదెబ్బ తగిలిన వ్యక్తికి ఉల్లిపాయను మెత్తగా నూరి శరీరానికి రాయాలి ● జీలకర్ర దోరగా వేయించి పొడిచేయండి. అర స్పూన్ పొడిని ఒక గ్లాసు నిమ్మరసంలో కలిపి ఉప్పు, పంచదార వేసుకొని తాగితే శరీరానికి బోలెడంత ఎనర్జీ వస్తుంది ● ఈ కాలంలో సలాడ్స్, తాజా కాయగూరలు, ఫ్రూట్ జ్యూస్‌లు తీసుకోవటం వల్ల మంచి ఫలితం ఉంటుంది. ● ఉడికించిన పచ్చి మామిడికాయ రసంలో ఉప్పు, జీలకర్ర కలిపి తాగుతుంటే వడదెబ్బ తగలదు.

వడదెబ్బ తగిలితే ఏం చేయాలి?

- నీరుల్లిపాయ రసం రెండు కణతలకు, ఛాతీమీద పూస్తే వడదెబ్బ నుంచి ఉపశమనం కలుగుతుంది.
- వడదెబ్బ తగిలిన వారి ముఖం మీద, ఒంటి మీద నీళ్లు చల్లుతూ ఉండాలి. గ్లాసుడు నీటిలో నిమ్మరసం, చిటికెడు ఉప్పు కలిపి తాగిస్తుండాలి ● శరీరం మీద ఉన్న దుస్తులను వదులు చేసి విశ్రాంతిగా పడుకోనివ్వాలి ● గ్లాసు నీళ్లలో స్పూను తేనె కలిపి ఇచ్చిన వడదెబ్బ నివారణ అవుతుంది ● వడగళ్ళు పడినపుడు ఆ ఐస్ గడ్డలను ఏరి విభూతిలో వేసి నిలువ ఉంచి జాగ్రత్తగా దాచి ఆ విభూతిని మూడువేళ్లకు వచ్చినంత తీసుకుని మంచినీటిలో వేసి వడదెబ్బ తగిలిన వారికి ఇస్తే వడదెబ్బ నివారణ అవుతుంది
- తరువాణి తేటలో ఉప్పును చేర్చి ఇవ్వాలి
- లేత తాటిముంజలను పంచదారతో కలిపి తినిపించాలి ● నాలుకకు పాత ఉసిరిక పచ్చడి రాసి పుల్లని మజ్జిగ లో ఉప్పువేసి అన్నంలో పోసి పిసికి పిప్పిని పారవేసి ఆ రసాన్ని తాగించాలి ● వేడి వేడి పలచటి గంజిలో ఉప్పు వేసి తాగించాలి.

ఎండవేళలో తప్పనిసరిగా బయటకు వెళ్లవలసి వస్తే, గొడుగు వాడాలి లేదా కనీసం నెత్తిన టోపీ లేదా రుమాలు పెట్టుకుని ఉంటే కొంత ఉపశమనం కలుగుతుంది.

సినిమా



● ప్రభాస్

సరికొత్త ప్రయత్నం?

ప్రభాస్ హీరోగా నాగ్ అశ్విన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'కల్కి 2898 ఏడీ'. ఈ చిత్రంలో అమితాబ్ బచ్చన్, కమల్‌హాసన్, దీపికా పదుకోన్, దిశా పటానీ ఇతర లీడ్ రోల్స్ చేస్తున్నారు. భైరవ పాత్రలో ప్రభాస్, పద్మావతి పాత్రలో దీపికా పదుకోన్, అశ్వత్థామ పాత్రలో అమితాబ్ కనిపిస్తారనే టాక్ వినిపిస్తోంది. సి. అశ్వనీదత్ నిర్మిస్తున్న ఈ చిత్రం మే 9న విడుదల కావాల్సింది. అయితే వాయిదా పడే అవకాశం ఉందట. కాగా ఈ చిత్రం యూనిట్ ఓ సరికొత్త ప్రయత్నం చేస్తోందనే టాక్ ప్రచారంలోకి వచ్చింది. ఈ చిత్రంలో లీడ్ రోల్స్‌లో కనిపించే ప్రభాస్, దీపికా పదుకోన్, అమితాబ్ బచ్చన్‌ల పాత్రలకు సంబంధించిన పూర్వాపరాలను, ఆ పాత్రల తీరు తెన్నులను చెబుతూ ఓ యానిమేటెడ్ వీడియోను రెడీ చేస్తున్నారట. ఈ వీడియో నేరుగా ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లో స్ట్రీమింగ్ కానుందని భోగట్టా. ఈ వీడియోలోని తన పాత్రకు ప్రభాస్ ఇప్పటికే డబ్బింగ్ కూడా పూర్తి చేశారని తెలిసింది. అయితే ఈ యానిమేటెడ్ వీడియో ఏ ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లో ఎప్పట్నుంచి స్ట్రీమింగ్ కానుంది? వీడియో నిడివి ఎంత? అసలు వార్తల్లో ఉన్నట్లు యానిమేటెడ్ వీడియో షూట్ జరిగిందా? లేదా అనే అంశాలపై స్పష్టత రావాల్సి ఉంది.



● రష్మిక

బర్త్‌డే స్పెషల్

'పుష్ప: ది రైజ్' చిత్రంలో శ్రీవల్లి పాత్రతో నేషనల్ క్రష్‌గా మారిపోయారు రష్మికా మందన్న. ఇటు దక్షిణాదితో పాటు అటు ఉత్తరాదిలో వరుస సినిమాలు చేస్తూ ఫుల్ స్వింగ్‌లో దూసుకెళుతున్న రష్మికా మందన్న పుట్టినరోజు ఏప్రిల్ 5. ఈ సందర్భంగా ఆమె నటిస్తున్న తాజా చిత్రాలు 'పుష్ప 2: ది రూల్', 'ది గర్ల్ ఫ్రెండ్', 'రెయిన్ బో' నుంచి బర్త్ డే స్పెషల్‌గా ఆమె కొత్త లుక్స్ విడుదల చేశారు మేకర్స్. అల్లు అర్జున్ హీరోగా సుకుమార్ దర్శకత్వంలో రూపొందుతోన్న చిత్రం 'పుష్ప: ది రూల్'. సుకుమార్ రైటింగ్స్ భాగస్వామ్యంతో మైత్రీ మూవీ మేకర్స్‌పై నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. రష్మిక బర్త్ డే సందర్భంగా 'పుష్ప: ది రూల్'లో ఆమె పాత్ర గెటప్‌ను రివీల్ చేస్తూ పోస్టర్‌ను రిలీజ్ చేసింది యూనిట్. ఈ ఆగస్టు 15న ఈ సినిమా విడుదలవుతోంది. ఇదిలా ఉంటే.. రష్మికా మందన్న, దీక్షిత్ శెట్టి జంటగా నటిస్తున్న చిత్రం 'ది గర్ల్ ఫ్రెండ్'. నటుడు రాహుల్ రవీంద్రన్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. అల్లు అరవింద్ సమర్పణలో ధీరజ్ మొగిలినేని, విద్య కొప్పినీడి నిర్మిస్తున్నారు. ఈ చిత్రం నుంచి స్పెషల్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు మేకర్స్. వైవిధ్యమైన ప్రేమకథతో తెరకెక్కుతున్న ఈ మూవీ 60 శాతం షూటింగ్ పూర్తయింది. అదే విధంగా రష్మిక లీడ్ రోల్‌లో నటిస్తున్న మరో చిత్రం 'రెయిన్‌బో'. శాంతరూబన్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో దేవ్ మోహన్ ముఖ్య పాత్ర పోషిస్తున్నారు. తెలుగు–తమిళ భాషల్లో ఈ చిత్రాన్ని డ్రీమ్ వారియర్ పిక్చర్స్ నిర్మిస్తోంది. ఈ మూవీ నుంచి కూడా రష్మిక లుక్ విడుదలైంది.

రామాయణ్‌కు సంగీతం?



● హన్స్ జిమ్మెర్, ఏఆర్ రెహమాన్

ఆస్కార్ విన్నింగ్ మ్యూజిక్ డైరెక్టర్స్ ఏఆర్ రెహమాన్, హన్స్ జిమ్మెర్ హిందీ 'రామాయణ్'కు సంగీతం అందించనున్నారన్నది తాజా టాక్. రామాయణం ఆధారంగా దర్శకుడు నితీష్ తివారీ 'రామాయణ్' అనే ట్రయాలజీని తెరకెక్కిస్తున్నారనే టాక్ వినిపిస్తున్న సంగతి తెలిసిందే. ముంబైలోని ఓ స్టూడియోలో వేసిన భారీ సెట్‌లో ఈ సినిమా చిత్రీకరణ జరుగుతోందని సమాచారం. ఈ సినిమాలో రాముడిగా రణ్‌బీర్ కపూర్, సీతగా సాయి పల్లవి, రావణుడి పాత్రలో యశ్, కైకేయి పాత్రలో లారా దత్తా కనిపించనున్నారనే ప్రచారం జరుగుతోంది. నటీనటుల పేర్లను యూనిట్ అధికారికంగా ప్రకటించలేదు. తాజాగా 'రామాయణ్' ట్రయాలజీకి ఏఆర్ రెహమాన్, హన్స్ జిమ్మెర్ సంగీతం అందించనున్నారనే టాక్ తెరపైకి వచ్చింది. హాలీవుడ్‌లో 'ది లయన్ కింగ్' (యానిమేటెడ్) 'డ్యూన్', 'గ్లాడియేటర్', 'ఇన్సెప్షన్' వంటి హిట్ సినిమాలకు హన్స్ జిమ్మెర్ సంగీతం అందించారు. 'ది లయన్ కింగ్', 'డ్యూన్' సినిమాలకు గాను హన్స్‌కు బెస్ట్ ఒరిజినల్ స్కోర్ విభాగంలో ఆస్కార్ అవార్డులు వచ్చాయి. 'స్లమ్‌డాగ్ మిలియనీర్' సినిమాకుగాను బెస్ట్ ఒరిజినల్ సాంగ్, బెస్ట్ ఒరిజినల్ స్కోర్ విభాగంలో ఏఆర్ రెహమాన్‌కు ఆస్కార్ అవార్డులు వచ్చిన సంగతి గుర్తుండే ఉంటుంది. కాగా వచ్చే శ్రీరామ నవమి సందర్భంగా 'రామాయణ్' చిత్రాన్ని అధికారికంగా ప్రకటించాలనుకున్నారట మేకర్స్. మరి... ఏఆర్ రెహమాన్, హన్స్ జిమ్మెర్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తారా? నటీనటులు ఎవరు? అనేది ఆ రోజు తెలిసిపోతుంది. ఈ చిత్రాన్ని నమిత్ మల్హోత్రా, అల్లు అరవింద్, మధు మంతెన దాదాపు రూ. వెయ్యి కోట్ల బడ్జెట్‌తో నిర్మిస్తున్నారట.

ఏమయ్యిందే..!



● అశోక్ గల్లా

సూపర్ స్టార్ కృష్ణ మనవడు, హీరో మహేశ్‌బాబు మేనల్లుడు అశోక్ గల్లా హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'దేవకీ నందన వాసుదేవ'. 'గుణ 369' ఫేమ్ అర్జున్ జంధ్యాల దర్శకత్వం వహిస్తున్న ఈ మూవీలో వారణాసి మానస హీరోయిన్. డైరెక్టర్ ప్రశాంత్ వర్మ ఈ చిత్రానికి కథ అందించారు. నల్లపనేని యామిని సమర్పణలో లలితాంబిక ప్రొడక్షన్స్‌పై సోమినేని బాలకృష్ణ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. కాగా శుక్రవారం (ఏప్రిల్ 5) అశోక్ గల్లా బర్త్ డే. ఈ సందర్భంగా ఈ మూవీ నుంచి 'ఏమయ్యిందే..' అంటూ సాగే ఫస్ట్ సింగిల్ ప్రోమోను విడుదల చేశారు మేకర్స్. ఈ చిత్రానికి భీమ్స్ సిసిరోలియో సంగీతం అందించారు. అశోక్, మానసల మధ్య వచ్చే ఈ పాట కలర్‌ఫుల్‌గా ఉంది.

● ప్రముఖ నిర్మాణ సంస్థ సితార ఎంటర్‌టైన్‌మెంట్స్‌లో అశోక్ గల్లా హీరోగా కొత్త సినిమా ప్రకటన వచ్చింది. ఈ చిత్రంతో ఉద్భవ్ దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. 'లవర్', 'మ్యాడ్' చిత్రాల ఫేమ్ శ్రీ గౌరీప్రియ కథానాయికగా నటించనున్నారు. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్‌పై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య ఈ చిత్రాన్ని నిర్మించనున్నారు. ఈ సినిమాకి సంబంధించిన మరిన్ని వివరాలను త్వరలో వెల్లడించనున్నారు నిర్మాతలు.

ఇక వ్యక్తిగత జీవితంపై ఫోకస్

వ్యక్తిగత జీవితానికి తాను ఎక్కువ ప్రాముఖ్యత ఇచ్చుకోవాల్సిన తరుణం వచ్చిందన్నట్లుగా మాట్లాడుతున్నారు హీరోయిన్ తాప్సీ. డెన్మార్క్ బ్యాడ్మింటన్ ప్లేయర్ మథియాస్ బోతో తాప్సీ వివాహం గత నెల 23న ఉదయ్‌పూర్‌లో జరిగిందనే వార్తలు వచ్చిన విషయం తెలిసిందే. అయితే తాప్సీ, మథియాస్ తమ పెళ్లి గురించి అధికారికంగా ప్రకటించలేదు. కానీ వధూవరులుగా తాప్సీ, మథియాస్ ఉన్న వీడియోలు వైరల్ అవుతుండటంతో వీరిద్దరికీ వివాహం జరిగిందని స్పష్టమైంది. కాగా పెళ్లి తర్వాత తాప్సీ ఓ ఆంగ్ల మీడియాతో మాట్లాడుతూ కొన్ని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ''కొన్నేళ్లు గడిచిన తర్వాత నేను నటించిన సినిమాల జాబితాను ఓ సారి చూసుకున్నప్పుడు ఆ జాబితా నాకు సంతోషాన్నివ్వాలి. ఎందుకుంటే నా జీవితంలోని ఎక్కువ సమయాన్ని సినిమాలకే కేటాయించాను. 24 గంటల్లో నేను పన్నెండు గంటలు పని చేసిన రోజులూ ఉన్నాయి. అయితే ఇకపై నేను నా వృత్తి జీవితంపైకన్నా, వ్యక్తిగత జీవితంపై ఎక్కువ ఫోకస్ పెట్టాలనుకుంటున్నా. అందుకే ఈ సినిమా వదులుకోకూడదు అనిపించేంత మంచి స్క్రిప్ట్ అయితేనే చేయాలనుకుంటున్నాను. కెరీర్‌కి మించిన జీవితం ఒకటి ఉంటుంది. ఆ జీవితాన్ని ఆస్వాదించాలనుకుంటున్నాను. కుటుంబ సభ్యులు, సన్నిహితులు, స్నేహితులతో సమయం గడపాలనుకుంటున్నాను'' అని చెప్పుకొచ్చారు తాప్సీ.



● మథియాస్, తాప్సీ



● తాప్సీ

బ్యాక్ టు షూట్

దాదాపు రెండు నెలల తర్వాత తిరిగి నటిగా మేకప్ వేసుకున్నారు ప్రియాంకా చోప్రా. ఇద్రిస్ ఎల్బా, జాన్ సెనా, ప్రియాంకా చోప్రా, జాక్ క్వాయిడ్, స్టీఫెన్ రూట్ ప్రధాన పాత్రధారులుగా హాలీవుడ్‌లో 'హెడ్స్ ఆఫ్ స్టేట్' అనే కామెడీ యాక్షన్ థ్రిల్లర్ మూవీ తెరకెక్కుతోంది. ఈ సినిమాకు ఇలియా నైషుల్లర్ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమా కొత్త షెడ్యూల్ చిత్రీకరణ అమెరికాలో మొదలైంది. ''..అండ్ వుయ్ ఆర్ బ్యాక్..'' అంటూ 'హెడ్స్ ఆఫ్ స్టేట్' సినిమా స్క్రిప్ట్‌ను తన ఇన్‌స్టా స్టేటస్‌లో షేర్ చేశారు ప్రియాంకా చోప్రా. దీంతో 'హెడ్స్ ఆఫ్ స్టేట్' షూట్‌లో ఆమె పాల్గొంటున్నారని స్పష్టమైంది. ఇక రెండు నెలల క్రితం తన వ్యక్తిగత పనుల కోసం ప్రియాంకా చోప్రా ఇండియా వచ్చారు. సోదరుడు సిద్ధార్థ్ చోప్రా నిశ్చితార్థం వేడుకలో చురుగ్గా పాల్గొన్నారు ప్రియాంక. ఈ వేడుకతో పాటు మరికొన్ని పనులను చక్కబెట్టుకుని ప్రియాంకా చోప్రా మళ్లీ నటిగా బిజీ అవుతున్నారు.



● ప్రియాంకా చోప్రా

స్నేహం నేపథ్యంలో...

దర్శకుడు కొరటాల శివ సమర్పణలో సత్యదేవ్ హీరోగా నటించిన చిత్రం 'కృష్ణమ్మ'. వీవీ గోపాలకృష్ణ దర్శకత్వం వహించిన ఈ మూవీలో అతీరా రాజ్, లక్ష్మణ్ మీసాల, రఘు కుంచె, నందగోపాల్ కీలక పాత్రధారులు. కృష్ణ కొమ్మాలపాటి నిర్మించిన ఈ సినిమా మే 3 రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా కృష్ణ కొమ్మాలపాటి మాట్లాడుతూ– ''రా అండ్ రస్టిక్ బ్యాక్‌డ్రాప్ యాక్షన్ మూవీగా తెరకెక్కించిన సినిమా ఇది. ఈ సినిమాతో సత్యదేవ్ మరో రేంజ్‌కి చేరుకుంటారు. కాలభైరవ అద్భుతమైన సంగీతం ఇచ్చారు'' అన్నారు. ''ఇంటెన్స్ థ్రిల్లర్‌గా రూపొందిన ఈ చిత్రంలో స్నేహం విలువను చూపిస్తున్నాం'' అన్నారు వీవీ గోపాలకృష్ణ.



● సత్యదేవ్

భవనమ్‌లో థ్రిల్

సప్తగిరి, ధనరాజ్, షకలక శంకర్, అజయ్, మాళవికా సతీషన్, స్నేహా ఉల్లాల్ ముఖ్య తారలుగా రూపొందుతున్న చిత్రం 'భవనమ్'. 'ది హాంటెడ్ హౌస్' అనేది ట్యాగ్‌లైన్. ప్రముఖ నిర్మాణ సంస్థ సూపర్ గుడ్ ఫిలిమ్స్ సమర్పణలో ఆర్‌బి చౌదరి, వాకాడ అంజన్ కుమార్, వీరేంద్ర సీర్వి నిర్మిస్తున్న ఈ చిత్రానికి బాలాచారి కూరెళ్ల దర్శకుడు. సస్పెన్స్ థ్రిల్లర్‌గా రూపొందుతున్న ఈ చిత్రం ఫస్ట్ లుక్, టీజర్‌ని విడుదల చేశారు. ''సస్పెన్స్ థ్రిల్లింగ్ హారర్‌తో పాటు కామెడీ ఎలిమెంట్స్‌తో రూపొందిస్తున్న ఈ చిత్రం అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకునే విధంగా ఉంటుంది'' అని మేకర్స్ అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: చరణ్ అర్జున్, కెమెరా: మురళీమోహన్ రెడ్డి ఎస్.



● అజయ్